# 108. అల్ కౌసర్ (సమృద్ధి) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఈ సూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన 'కౌసర్' (సమృద్ధి) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు ప్రసాదించబడిన అసంఖ్యాక అనుగ్రహాలను ప్రస్తావిస్తూ, అల్లాహ్‌ను కొనియాడాలని, ఆయనకు కృతజ్ఞత చూపాలని బోధించడం జరిగింది. అవిశ్వాసుల వైరం, వారి గర్వం ప్రవక్త(సఅసం)ను ఏమాత్రం నష్టపరచలేవని హామీ ఇవ్వడం జరిగింది.

## 108. అల్ కౌసర్[1] సూరా

سُورَةُ الْكَوْثَرِ

అవతరణ : మక్కా    ఆయతులు : 3

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** నిశ్చయంగా మేము నీకు కౌసర్ (సరస్సును, మరెన్నో వరాల)ను ప్రసాదించాము.[2]

إِنَّا أَعْطَيْنَاكَ الْكَوْثَرَ ①

**2** కాబట్టి నువ్వు నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి, ఖుర్బానీ ఇవ్వు.[3]

فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ ②

1. ఈ సూరాను సూరతు'న్నహ్ర్'గా కూడా వ్యవహరిస్తారు.

2. **'కౌసర్'** ( كَوْثَر ) అనే పదం బహుళార్థకాలకు సంకేతం. దీని అర్థాలు కూడా అనేకం. ఇబ్నె కసీర్ గారు 'అత్యధిక శుభాలు' అన్న అర్థానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎందుకంటే ఇతరత్రా అర్థాలు కూడా ఈ పదంలో ఇమిడి ఉన్నాయి. ఉదాహరణకు ప్రామాణిక హదీసులలో వచ్చిన వివరాల ప్రకారం కౌసర్ అనేది స్వర్గంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు వొసగబడే ఒక కాలువ. మరికొన్ని హదీసులలో కౌసర్ అనేది ఒక 'సరస్సు' అని, విశ్వాసులు స్వర్గంలో ప్రవేశించేముందు మహాప్రవక్త (సఅసం) చేతుల మీదుగా ఆ సరస్సు నీరును త్రాగుతారని, ఆ సరస్సులోకి వచ్చే నీరు కూడా స్వర్గంలోని ఆ కాలువకే చెందింది అయి ఉంటుందని తెలుపబడింది. అలాగే ఇహలోకంలో మహాప్రవక్త (సఅసం) వారికి లభించిన విజయాలు, కీర్తి ప్రతిష్ఠలు, పరలోకంలోని పుణ్యఫలాలు – ఇవన్నీ ఈ "అత్యధిక శుభాలు" లోకి వచ్చేస్తాయి. (ఇబ్నె కసీర్).

3. అంటే నమాజు కూడా కేవలం ఒక్కడైన అల్లాహ్ కొరకే చేయాలి. ఖుర్బానీ కూడా ఒక్కడైన ఆ అల్లాహ్ పేరిటే ఇవ్వాలి. బహుదైవారాధకుల మాదిరిగా ఈ ఖుర్బానీలో ఇతరులను భాగస్వాములుగా చేర్చరాదు. 'నహ్ర్' అంటే ఒంటె గొంతుపై ఈటెతోగానీ, కత్తితోగానీ కొట్టి, ఆ తరువాత దానిని 'జిబహ్' చేయటం అని అసలు అర్థం. అయితే ఇతర పశువులను మాత్రం నేలపై పరుండబెట్టి గొంతు కోయటాన్ని 'జిబహ్'గా వ్యవహరిస్తారు. కాని ఈ ఆయతులో 'నహ్ర్' అంటే అసలు సిసలు అర్థం ఖుర్బానీ. ఇక ఇతరత్రా దానధర్మాలుగా పశువును ఖుర్బానీ చేయటం, హజ్ సందర్భంగా





**3** ముమ్మాటికీ నీ శత్రువే నామరూపాల్లేకుండా పోయేవాడు.[4]

إِنَّ شَانِئَكَ هُوَ الْأَبْتَرُ ③

'మినా' పర్వత లోయలో పశువును ఖుర్బానీ చేయటం, బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వటం – ఇవన్నీ ఇందులో అంతర్భాగాలే.

4. **'అబ్‌తర్'** అంటే తోక తెగటం అని అసలు అర్థం. ఒకరి వంశపరంపర ముందుకు సాగకుండా ఆగిపోయిన వారిని, పేరు కూడా ప్రస్తావించకుండా వదిలివేసిన అనామకులను 'అబ్‌తర్'గా వ్యవహరిస్తారు. మహాప్రవక్త ముహమ్మదు (సఅసం) వారి మగపిల్లలు చనిపోవటం గమనించిన కొంతమంది అవిశ్వాసులు ఆయన్ని 'అబ్‌తర్'గా అవహేళన చేయసాగారు. అప్పుడు దేవుడు ఆయన్ని (స) ఓదారుస్తూ ఈ వాక్యాలను అవతరింపజేశాడు –

"ఓ ముహమ్మద్ (స)! నీవు అనామకుడవు కావు. నీ విరోధులే అనామకులవుతారు" అని ధైర్యం చెప్పాడు. మహాప్రవక్త (స) ఆడపిల్లల ద్వారానే దేవుడు ఆయన సంతతికి ప్రపంచంలో గొప్ప కీర్తి ప్రతిష్ఠల్ని ప్రసాదించాడు. ఒకవిధంగా చెప్పాలంటే ఆయన (సఅసం) అనుచర సమాజమంతా ఆయన బిడ్డల్లాంటివారే. వారి సంఖ్యాబలంపై ఆయన (స) ప్రళయదినాన గర్వపడతారు. అదీగాక ఆయన (స) గౌరవమర్యాదలను దేవుడు ఎంతగానో పెంచాడు. లోకమంతా నేడు ఆయన (స) పేరును ఎంతో భక్తితో, వినయంతో ప్రస్తావిస్తుంది. ఆయన (సఅసం)పై శాంతీశుభాలు కురవాలని లోకవాసులంతా ప్రార్థిస్తారు. అదే సమయంలో మహాప్రవక్త (స) శత్రువులు చరిత్రపుటలకే పరిమితం అయిపోయారు. ఒకవేళ ఎవరయినా వారి ఊసు ఎత్తినా వారిని దుష్టులుగానే చూస్తారుగాని మంచివారుగా చూడరు.